

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

బుధవారం 13, మే 2026




# డబ్బుల కోసం దారుణ హత్య

- రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:

షాద్‌నగర్ పోలీసులు రెండు రోజుల్లోనే హత్య కేసును ఛేదించి, డబ్బుల కోసం ఓ వ్యవసాయ కార్మికుడిని హత్య చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

షాద్‌నగర్ డిసిపి శిరీష కథనం ప్రకారం... సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు పల్లె కేశవులు (39) సర్దార్ నగర్ ప్రాంతంలోని ఓ ఫామ్ హౌస్‌లో కుటుంబంతో కలిసి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మే 10న వీర్లపల్లి రోడ్డుకు సమీపంలోని ఎస్ఆర్ఆర్ వెంచర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని డయల్-100కు సమాచారం రావడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడ కేశవులు తలకు తీవ్ర గాయాలతో మృతిచెందినట్లు గుర్తించారు.

దర్యాప్తులో భాగంగా, కుటుంబ భూ వివాదం పరిష్కారం కోసం కేశవులు మే 9న తన యజమాని వద్ద నుంచి రూ.50 వేల రూపాయలు అప్పుగా తీసుకుని పరిగికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అందులో రూ.40 వేలను ఓ బంధువుకు ఇచ్చి, మిగిలిన నగదుతో షాద్‌నగర్‌కు తిరిగి వచ్చాడు. అనంతరం తాను షాద్‌నగర్ బస్టాండ్‌కు చేరుకున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పిన తర్వాత అతని మొబైల్ స్విచ్ఛాఫ్ అయింది.

మే 9 రాత్రి కేశవులు షాద్‌నగర్ బస్టాండ్ మిగతా.. 2లో



# ఇదేం ఆసుపత్రి వైద్యం ఎలా ?

- అందని ద్రాక్షలా మెరుగైన వైద్యం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర ఫైర్

అక్షిత ప్రతినిధి/భూపాలపల్లి :

జయశంకర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు..జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రినీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులు అదే విధంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు..ఆసుపత్రిలో కనీసం నీళు లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు...రోగులు బయట నీళు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు..

ఆసుపత్రి పక్కనే మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ మిగతా.. 2లో

# కొనుగోళ్లపై నిర్లక్ష్యం వద్దు

- అవసరమైతే అన్ని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి
- కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి
- స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి
- ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి
- ధాన్యం కొనుగోళ్లపై వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించాలి
- జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్





మెదక్, అక్షిత బ్యూరో:

ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దానసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మెదక్ ఐడీఓసీ నుండి పాల్గొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూలి మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని మిగతా.. 2లో

# స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి కృషి

- అనవసర వ్యయం తగ్గించుకోవాలి
- ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు




రంగారెడ్డి, అక్షిత బ్యూరో:

దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక మిగతా.. 2లో

# డబ్బుల కోసం దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలోని వైన్ షాప్‌లో మద్యం సేవిస్తుండగా బజరన్నతో పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో కేశవులు వద్ద భారీ మొత్తంలో నగదు ఉందని బజరన్న గమనించాడు. అనంతరం తనకు ఓ మహిళను ఏర్పాటు చేయాలని కేశవులు కోరగా, యాదమ్మను అతనికి పరిచయం చేసినట్లు తెలిపారు.తర్వాత నిందితులు కేశవులను ఎస్ఆర్ఆర్ వెంచర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ డబ్బులు దోచుకునేందుకు బజరన్న ప్రయత్నించగా, కేశవులు ప్రతిఘటించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో బజరన్న రాయితో కేశవులిపై దాడి చేసి తలకు తీవ్ర గాయాలు కలిగించడంతో అతడు అక్కడికక్కడే




మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.హత్య అనంతరం నిందితులు కేశవులు వద్ద నుంచి రూ.7,500 నగదు తీసుకుని బైక్‌పై పరారయ్యారు. అనంతరం బజరన్న గద్వాల్‌లో తలదాచుకున్నప్పటికీ తిరిగి షాద్‌నగర్‌కు వచ్చిన సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.3,900 నగదు, హోండా షైన్ మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది.

ఈ సమవేశంలో షాద్నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ ,ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం పాల్గొన్నారు.

# ఇదేం ఆసుపత్రి వైద్యం ఎలా ?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నప్పటికీ, ఆసుపత్రికి కనెక్షన్ ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

గతంలోనే ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని గంద్ర తెలిపారు. ఆసుపత్రిలో అందిస్తున్న ఆహారం కూడా నాసిరకంగా ఉందన్నారు.. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్



చేశారు..లేకపోతే భవిష్యత్‌లో హాస్పిటల్ ముందు నిరసన కార్యక్రమం చేపడుతామని అధికారులను హెచ్చరించారు.

# కొనుగోళ్లపై నిర్లక్ష్యం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసు సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్ధవంతమైన అధికారిని నియమించాలని,ఆయా అధికారులు ప్రతి రోజూ నిఎ ేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సాధారణ విధానాన్ని విడిచి మిషన్ మోడ్‌లో పని చేయాలని,కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలను జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద 11 లక్షల 52 వేల టన్నుల ధాన్యం



పెండింగ్‌లో ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను బ్యాంకుల ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి, ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ. 4,178 కోట్లను ఆమోదించిందని తెలిపారు.ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరగగా, ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు కూడా అధిక ధరలకు మరో 6 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 14 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వ అవసరం ఉండగా ఇప్పటికే 10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు.అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచామని, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా సరఫరాలో కొంత అంతరాయం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే డీబీటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు.హమాలీలు,గన్నీ సంచులు, నిల్వ సామర్థ్యం అంశాలపై కలెక్టర్లతో నిరంతర సమన్వయం కొనసాగుతోందని తెలిపారు. హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ. 8.50కు పెంచినట్లు చెప్పారు. అవసరమైన రవాణా వాహనాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓ రమాదేవి జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఎడ్ల జోగిరెడ్డి హైదరాబాదు లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. తిమ్మాపూర్ మాజీ జెడ్పిటిసి ఎడ్ల భాగ్య భర్త ఎడ్ల జోగిరెడ్డి, గతంలో తిమ్మాపూర్ ఎంపీటీసీగా, తెలంగాణ ఉద్యమంలో ఎడ్ల జోగిరెడ్డి క్రియాశీలకంగా పనిచేశారు. ప్రస్తుతము తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకునిగా, బిజెపి జిల్లా నాయకునిగా కొనసాగుతున్నారు.వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

# స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు.





చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు.

అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. ఈ సదస్సులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్మయి, దక్షిణ జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జి.ఫణీంద్ర రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ సీ.ఈ.ఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కమిషనర్ లు, డిపిఒలు, డీఎల్పీఓలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను ఈ నెల 15 తారీకు, శుక్రవారం వేలం వేయనున్నట్లు సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రభుత్వ పోలీస్ వాహనాలకు సంబంధించి రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబా టులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శుక్రవారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 87126 85158, 9440242895,9949568320 నంబర్లకు సంప్రదించగలరని సీపీ తెలిపారు

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారు

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో హన్వాడ




మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సి. చరణ్ కుమార్ (473 మార్కులు), డి. విజయలక్ష్మి (468 మార్కులు), డి. రాకేష్ (452 మార్కులు), ఎన్. అక్షయ (443 మార్కులు), పి. కార్తిక్ (431 మార్కులు) అభినందనలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విద్యలో అగ్రస్థానంలో నిలుస్తుందని



ఆశాభావం వ్యక్తం చేశారు.

గతంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సరైన దృష్టి పెట్టి ఉంటే రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందేదని అన్నారు. పేద విద్యార్థులు చదువుకోవాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, కార్పొరేట్ స్థాయిని తలదన్నే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. ఉపాధ్యాయులు వెనుకబడిన, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు సాయినాథ్, శ్రీనాథ్, వెంకటేష్, షాబుద్దీన్, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





# జాప్యం చేస్తే కఠిన చర్యలు

**- కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్:** మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలో జాప్యం జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్క జొన్న సేకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుండి మంత్రులు, రాష్ట్రస్థాయి సీనియర్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో ధాన్యం సేకరణ పై సమీక్ష నిర్వహించారు.

ఇకపై జిల్లాలో ప్రతిరోజు కనీసం 20 నుండి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే లక్ష్యంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద వచ్చిన దాన్యం లారీలు ,ఇతర వాహనాలు ఎట్టి పరిస్థితులలో వెంట వెంటనే అన్లోడ్ కావాలని, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా జాప్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రేడ్ ఏ, కామన్ వెరైటీ రెండు కలిపి మిల్లులకు పంపించకుండా చూడాలని, ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎప్పటి ట్రక్ చీటీలు అప్పుడే తెప్పించుకోవాలని ఆదేశించారు. మిర్యాలగూడ మిల్లులలో 1,34,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునేందుకు అవకాశం ఉందని, మిర్యాలగూడ రైస్ మిల్లులపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. రానున్న 20 రోజులు ప్రస్తుతం ట్రాన్స్పోర్ట్ చేస్తున్న లారీలు రొటేషన్ అయ్యేలా చూడాలని, లారీల సమస్యను అధిగమించేందుకు ట్రాన్స్పోర్ట్ అధికారులతో పాటు, సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. దాన్యం ఎక్కువగా నిలువ ఉన్న కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించే ఏర్పాటు చేయాలని, లారీ సమస్యల వల్ల ధాన్యం మిల్లులకు పంపించడం ఆగిపోకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఇంకా 2 లక్షల 60000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ రైస్ మిల్లుల వద్ద మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు నిరాకరిస్తే అవసరమైతే పోలీస్ సహకారం అందిస్తామని తెలిపారు.

అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోలుపై జిల్లా కలెక్టర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలను కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేయాలని, ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక బాధ్యత కలిగిన అధికారిని నియమించాలని, ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక అధికారిని ఏర్పాటు చేయాలని ,జిల్లాలో సమస్యలు వస్తే కలెక్టర్లదే పూర్తి బాధ్యత అని అన్నారు. కలెక్టర్లు, అధికారులు మిషన్ మోడ్ లో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో వెళ్లి ఎప్పటికప్పుడు ధాన్యం సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. లారీల సమస్య ఉన్న చోట రోడ్డుపై లారీలు గుర్తించి వెంటనే ధాన్యం నింపి మిల్లులకు పంపించి ధాన్యాన్ని అన్లోడింగ్ కు ఉపయోగించుకోవాలని చెప్పారు. హమాలీల సమస్యను తీర్చేందుకు స్థానిక హామాలీలతో పని చేయించుకునేలా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, ధాన్యం లోడు చేసిన చోటే రైతులకు రశీదు ఇవ్వాలని, ఎక్కడ ఖాళీ వాహనం కనిపించిన ధాన్యం కోసం ఉపయోగించాలని, వర్షం వల్ల ధాన్యం తడవకుండా టార్పాలిన్లను ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను స్థానికంగా సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ నివేదికలను తెప్పించుకొని ధాన్యం సేకరణలో నిమగ్నమైన అధికార యంత్రాంగం అంతటిని అప్రమత్తం చేయాలని, ప్రత్యేకించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తహసిల్దార్, ఎంపీడీవో స్థాయి అధికారిని వాతావరణ హెచ్చరికలకు సంబంధించిన విషయాలపై ఏర్పాటు చేయాలని, తడిసిన ధాన్యం కూడా తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు ఎవరైనా దాన్యం దించుకునేందుకు అంగీకరించనట్లయితే అవసరం అయితే పోలీస్ ఫోర్స్ ఉపయోగించాలన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో ధాన్యం దించుకోవడంలో ఇబ్బందులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ,ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో ఏదైనా కేంద్రంలో సమస్య వస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలుపై వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి వివరణలు ఇవ్వాలని ఆదేశించారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలు సూచనలు చేశారు.

జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రెవిన్యూ అదనపు కలెక్టర్ కలెక్టర్ జె. శ్రీనివాస్, పౌరసరఫరాల డిఎం రాంపతి నాయక్, పౌరసరఫరాల అధికారి వెంకటేశం, డిఆర్ డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్, మార్కెటింగ్ ఎడి చాయ దేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అభివృద్ధి, ప్రజాసేవకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు సభ్యులు**

**జడ్చర్ల ,అక్షిత న్యూస్:** జడ్చర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల ఆకర్షితులై జడ్చర్ల మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, వార్డు సభ్యులు నేడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పోలేపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు సల్మాన్, యాదయ్య, అనూష శివ, ఎరుకలి కర్రెమ్మ, పానుగంటి రమేష్, జ్యోతి శంకర్ నాయక్, సరిత చంద్రమౌళి తదితరులు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.








# కొల్లాపూర్‌లో ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి

**గర్భిణీలు, బాలింతలకు ఉచిత ప్రయాణం**

**కొల్లాపూర్ పట్టణంలోని మాత శిశు సంరక్షణ ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతల రవాణా కష్టాలు ఇక తీరనున్నాయి**

**కొల్లాపూర్, సీతా ప్రతినిధి:** కొల్లాపూర్ నియోజకవర్గం లోని మాత శిశు సంరక్షణ ఆస్పత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతల రవాణా




కష్టాలు ఇక తీరని ఉన్నాయి వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణం నుంచి రామాపురం శివారులో ఉన్న మాత శిశు సంరక్షణ ఆసుపత్రికి వెళ్లేందుకు రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ వాహనాన్ని సమకూర్చారు. హైదరాబాదుకు చెందిన గుడ్ యూనివర్సిటీ సామాజిక సేవ సంస్థ, అర్సేసియం సంస్థల ఆకారంతో ఈ పర్యావరణహిత వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే లేదా ప్రజలు రోగులకు ఈ ఉచిత రవాణా సౌకర్యం ఎంతో ఉరటనిస్తుందన్నారు. సురక్షితమైన సులభతరమైన ప్రయాణాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన సేవా సంస్థలను మంత్రి జూపల్లి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని నడిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనుష్క వంశీ ఆస్పత్రి సూపర్ సూపరింటెశిడెంట్ శ్రీనివాసులు మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం కౌన్సిలర్లు సుజాత కర్ని శివ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.





# వేదగిరికి మళ్ళీ పూర్వ వైభవం..

- **ప్రారంభోత్సవానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర ప్రముఖులు..**
- **ప్రత్యేక అతిథిగా అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాస్వామి**
- **గురు నిలయానికి భూమి పూజ..**
- **వైభవంగా గిరిప్రదక్షిణ**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** సకల దేవతల ఆలయాలకు ప్రసిద్ధి చెందిన దేవగిరి ప్రస్తుతం మళ్ళీ పూర్వవైభవం పొందడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడు చౌదరిగుడా మండలం వేదగిరి కొండపై హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఇక్కడ గిరిప్రదక్షిణ, గురు నిలయానికి భూమి పూజ వంటి కార్యక్రమాలు చేపట్టారు. వేదగిరి వేద పీఠం వ్యవస్థాపకులు మర్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేదగిరి పై వెలసిన వేదాంజనేయ స్వామి ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ ఎత్తున భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.. ఈ కార్యక్రమం ప్రత్యేక అతిథిగా అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాస్వామి కూడా హాజరయ్యారు. ఇలాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు భక్తులను ప్రశాంత వాతావరణం వైపు నడిపించి జీవితంలో ఉన్నతికి ఎదిగేలా ప్రోత్సహిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఉదయం 6:30 గంటలకు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహన ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు . ఈ ర్యాలీ ద్వారా వేద గిరి చేరుకొని అక్కడ 8:02 గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహించారు. అదేవిధంగా 10:30 కి సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో వేదగిరి దేదీప్యమానంగా వెలిగేలా తీర్చిదిద్దనున్నట్లు డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి తెలిపారు .


**అతి గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్ నగర్ నియోజకవర్గంలో అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రంగా ఒకప్పుడు వేదగిరి వెలుగు వెలిగిందని, ఇప్పుడు మళ్లీ మర్రి కృష్ణారెడ్డి సహకారంతో పూర్వ వైభవం రావడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలలో ఆధ్యాత్మిక చింతనను పెంచుతాయని, అందుకే ఆలయాలకు నిరంతరం తన సహకారం ఉంటుందని వెల్లడించారు. యాదగిరి ఆలయాన్ని కూడా ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఆయన వెల్లడించారు. విశాలమైన స్థలంలో ప్రశాంతమైన కొండమీద సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడిన వేదగిరి భవిష్యత్తులో పర్యాటక క్షేత్రం మారుతుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్త బృందం హాజరయ్యారు. కొందుర్గు,చౌదరి కూడా మండలాల కాంగ్రెస్ నాయకులు, ఇతర పార్టీల నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు..



# కంఠమహేశ్వర స్వామి ఆలయానికి పదివేల విరాళం

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:**
రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ సురమాంబ సమేత కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ. 10,116 విరాళంగా సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దైద రవీందర్‌ను ఘనంగా సన్మానించారు.



కార్యక్రమంలో దుబ్బాక గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండాల నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్ గుండాల నర్సింహ, గుండాల సతీష్, మాజీ సర్పంచ్ గట్టు యాదయ్య, శెట్టి శేఖర్, బత్తుల రమేష్, బీఎన్ గౌడ్, గట్టు శ్రీనివాస్, గట్టు బాలు, గుండాల కిరణ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి

**ఎంపిడిఓ ఎం.శేషగిరి శర్మ**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:** భూగర్భజలాలు ప్రతి ఇంట్లో పెంపుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మిర్యాలగూడ ఎంపిడిఓ ఎం. శేషగిరి శర్మ కోరారు. మంగళవారం సంచాయ్ జన భాగీదారి కళాజాత బృందం మిర్యాలగూడ మండలం తుంగపహాడ్, శ్రీనివాస నగర్ గ్రామపంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి పథకం ఎపీడి బాలకృష్ణ , ఎపిఎం దిలీప్ లు ఆటపాటలతో గ్రామాలలో




భూగర్భ జల మట్టం పెంచుటకు వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, ప్రతి ఇంట ఇంకుడు గుంతలు తవ్వించాలని గ్రామాలలో మురుగు కాలువలకు చివరన డ్రైన్ ఎండ్ సోక్ పిట్ నిర్మించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామాలలో పచ్చదనం పెంపొందించుటకు ప్రతి ఇంటిలో 6 మొక్కలు నాటాలని అందువల్ల పర్యావరణం కాపాడబడుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు వినయ్, శ్రీకాంత్ రెడ్డి, ఎపిఓ సురనాయక్, ఇసి బి.కళావతి, టెక్నికల్ అసిస్టెంట్లు రేణుక, లాలు, ఫీల్డ్ అసిస్టెంట్ సంపంగి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



# నూతన మండల, మున్సిపాలిటీ అధ్యక్షులకు సన్మానం

### శాలువా కప్పి సన్మానించిన నాయకులు

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** కొత్తూరు మండల,మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎల్లారం శేఖర్ రెడ్డి,జాండగూడెం సుదర్శన్ గౌడ్ ను శాలువా కప్పి సన్మానించిన మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇందూరి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు బాధ్యతలు చేపట్టిన శేఖర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మండలంలో, మరియు మున్సిపాలిటీలో మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్,మాజీ వార్డ్ సభ్యుడు గోవింద్ నాయక్,కొండారెడ్డి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలు

### నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు

**గద్వాల, అక్షిత న్యూస్:** గద్వాల ప్రజలకు అంతరాయం కలగకుండగా ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ స్థలాల్లో ఫుట్పాతులపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ అధికారుల, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఇట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గద్వాల పట్టణ ప్రజల సేఫ్టీని దృష్టిలో పెట్టుకుని ఫుట్ పాతులపై ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల డబ్బాల వల్ల ప్రజలకు





ఎలాంటి ఆ సౌకర్యం కలగకుండా (వాహనాల రద్దీ విషయంలో గానీ కాలనీవాసులు నడిచి వెళ్లే విషయంలో గాని) ఉండేందుకే వాటిని తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు గద్వాల జిల్లా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు ఆధ్వర్యంలో డబ్బాలను తొలగించడం జరుగుతుంది.

# కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకం విప్లవాత్మక పథకం...

**దరఖాస్తు చేసుకున్న రెండు నెలలో లబ్ధిదారులకు చెక్కులు అందాలి.**

**ఇక నుండి లబ్ధిదారుల ఇంటి వద్దకే కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు.**

**ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి తావు ఉండకూడదు**

**మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘనపూర్, అక్షిత న్యూస్:** జనగాం జిల్లా లింగాల ఘనపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కళ్యాణ లక్ష్మి -షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగాల ఘనపూర్ మండలానికి సంబందించిన 51మంది కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ లబ్ధిదారులకు 51లక్షల 05వేల 916 రూపాయల విలువగల చెక్కులను మరియు 18మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 6లక్షల 84వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు.



అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలఅమలులో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు పని చేయాలని అన్నారు. కల్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న రెండు నెలలో చెక్కులు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని త్వరితగతిన తల్లిదండ్రులు అందించేందుకు గ్రామాలలో పెళ్లి జరిగిన నెల రోజులలోపు దరఖాస్తు చేసుకునే విధంగా సర్పంచ్ లు చొరవ తీసుకోవాలని సూచించారు. కల్యాణ లక్ష్మి పథకం విప్లవాత్మక పథకం అని కొనియాడారు. ఆడపిల్ల తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని లక్షా 116రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

గతంలో ఉన్న పాలకులు పనులు, పథకాలు, పదవులు అమ్ముకొని చిల్లర పనులతో నియోజకవర్గ పరువు తీసారని అన్నారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదని ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి తావు లేదని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజల ఇంటికి చేర్చే బాధ్యత నాదని పేర్కొన్నారు. లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో తెలంగాణ మాడల్ ఏర్పాటు కానుందని తెలిపారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న బాలికల వసతి గృహం నిర్మాణానికి 1కోటి 40లక్షలు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని, అనంతరం రాజకీయాలకు అతీతంగా గ్రామాలను, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మనందరం కలిసి స్టేషన్ ఘనపూర్ యోజకవర్గాన్ని అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్, ఎంపిడివో, మార్కెట్ వైస్ చైర్మన్ శివ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, మండలం ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ఆంజనేయుడిని కొలిచిన వారికి సకల శుభాలు కలుగుతాయని మరియు చేసేటువంటి పనులలో ఆటంకాలు తొలగిపోతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,వివిఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి పరివారంతో కలిసి కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్నటువంటి హనుమాన్ ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయుడు చాలా గొప్ప గురుభక్తి గలవాడని మరియు అతడిని కొలిచిన వారికి అన్ని విధాలుగా లాభాలు చేకూరుతాయని వారు చెప్పారు. శ్రీరాముని యొక్క మార్గాన్ని అనుసరిస్తూ ఎటువంటి నిర్లక్ష్యం మరియు ఆలస్యం లేకుండా చెప్పిన విధానాన్ని అమలుపర్చి తన కార్యాలను అమలు పరిచి సత్ఫలితాలు పొందాడని వారు చెప్పారు హనుమాన్ జయంతి నాడు ప్రతి ఒక్కరూ ఉపవాసాన్ని పాటిస్తూ హనుమాన్ చాలీసా ను పటిస్తారని నేటికీ మన భారతదేశంలో హనుమాన్ జయంతిని పండుగగా నిర్వహించడం వస్తున్నదని , వైశాఖ శుద్ధ దశమి నాడు హనుమాన్ జయంతిని జరుపుకోవడం గొప్ప విశేషం అని గుర్తు చేశారు.


ఆంజనేయుడు ప్రతి ప్రదేశంలో ఉంటాడని మరియు ఆంజనేయుడు బలవంతుడుమని, ధైర్యవంతుడని, సద్గుణవంతుడని కొనియాడారు. హనుమాన్ జయంతికి భారతదేశ చరిత్రలో ప్రత్యేకత ఉన్నదని మరియు హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని



ఆంజనేయుడిని వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలలో కొలుస్తానని వారు తెలిపారు

జయంతిని పురస్కరించుకొని వారు ఆంజనేయునికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు మరియు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారు. ఈ కార్యక్రమం బ్రహ్మశ్రీ డా. గర్రెపల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకమున నిర్వహించడం జరిగినది చెప్పారు నరేందర్ రెడ్డి పరిమాణాన్ని మృత్వికుల బృందం ఘనంగా ఆశీర్వదించి చేపట్టబోయే కార్యక్రమాలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యాసంస్థల సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు






# జిల్లా కలెక్టర్లతో సీఎం సమీక్ష

**మక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు,అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**వరంగల్, అక్షిత బ్యూరో:** రాష్ట్రం లోని జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్ లతో సీఎం సమీక్ష నిర్వహించారు. రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్ల సేకరణ తదితర అంశాలు పారదర్శకంగా ఉండేలా జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,వివిధ జిల్లాల కలెక్టర్లు జిల్లా వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ముమ్మరంగా ఇంటింటి సర్వే

**డివిజన్ల వారీగా వివరాల సేకరణ**

**జనగణనలో ప్రజలు వివరాలను అందించి సహకరించాలి**

**కమీషనర్ ప్రఫుల్ దేశాయ్**

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ నరపాలక సంస్థ పరిధిలో జనాభా గణన ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతుందని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. 2027 జన గణనలో భాగంగా నగరపాలక సంస్థ పరిదిలో డివిజన్ల వారిగా ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ గృహాల జాబితా నమోదు చేస్తూ వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. నగరంలోని ప్రతి డివిజన్‌ను ఇప్పటికే నిర్దిష్టమైన హౌజ్ లిస్టింగ్ బ్లాకులుగా విభజించి, సర్వేను క్రమబద్ధీకరించారు. ప్రతి బ్లాక్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను కేటాయించి, ఆ పరిధిలోని ప్రతి నివాసాన్ని సర్వే చేసేలా చర్యలు చేపట్టారు. నగర వ్యాప్తంగా దాదాపు 666 ఎన్యూమరేషన్ బ్లాకులను ఏర్పాటు చేయడం జరిగింది. మొత్త 666 ఎన్యూమరేటర్లు, 111 మంది సూపర్ వైజర్ల తో పాటు నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది కూడ జనాభా సర్వేలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.ప్రభుత్వం చేపట్టిన 2027 జనాభా లెక్కింపుకు నగర ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని పిలుపు నిచ్చారు. సర్వేలో భాగంగా ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు ఇంటింటికి తిరుగుతూ ఇంటి యజమాని వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వే సమయంలో డివిజన్ల వారిగా ఇంటింటికి వచ్చిన ఎన్యూమరేటర్లు సూపర్ వైజర్లకు ప్రజలు సహకరించి మీ ఖచ్చితమైన వివరాలను అందించాలని పిలుపు



నిచ్చారు. జన గణనలో ప్రస్తుతం ప్రతి ఇంటి తలుపుపై లేదా గోడపై విశిష్ట గుర్తింపు సంఖ్యను చాక్‌పీస్ లేదా స్టిక్కర్ల ద్వారా వేయడం జరుగుతుందని తెలిపారు. హౌజ్ లిస్టు బ్లాక్ సర్వే కొనసాగుతుందని ప్రజలు దానికి సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లు సేకరిస్తున్న డేటాను సరిచూస్తూ, ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిదిలో స్వయంగా క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలిస్తూ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. నగర అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఈ సర్వే చాలా ముఖ్యం అన్నారు. ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి, సరైన వివరాలు అందించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామాలలో ప్రతి ఒక్క కుటుంబము జనగణనలో పాల్గొనాలి

**సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్**

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే 11 నుండి జూన్ 09 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబము పాల్గొనాలని గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్ ఉప సర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్ పంచాయతీ కార్యదర్శి మహేష్ కోరారు. మంగళవారం చంద్రబండ తండా గ్రామంలో నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమమును ఎన్యుమరేటర్ మన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనలని గ్రామ ప్రజలను కోరారు. గ్రామంలో ఉన్న వారితో పాటు హైదరాబాదు, ఇతర ప్రాంతాలలో ఉన్న వారు మీ యొక్క కుటుంబ సభ్యుల సమాచారాన్ని తెలియచేస్తూ జనగణనలో పాల్గొన్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో



గ్రామ నాయకులు కేతావత్ భాస్కర్ హరిసింగ్ లక్ష్మణ్ జగన్ బాలాజి హమ ప్రజలు పాల్గొన్నారు.





# బాలుడుపై వీధి కుక్కల దాడి

**ప్రాణాపాయ స్థితిలో బాలుడు**

**వీధి కుక్కల ప్రమాదాలు నుండి ప్రజలను కాపాడండి**

**మాజీ కార్పొరేటర్ మోద్దు లచ్చిరెడ్డి**

**ఎల్బీనగర్ /అక్షిత ప్రతినిధి:** హస్తినాపురం పూర్వపు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో 8 వీధి కుక్కల దాడిలో బాలుడు కితీవ్ర గాయాలు, ప్రాణాపాయస్థితిలో ఎల్బీనగర్ కామినేని లో వైద్య చికిత్స విషయం తెలుసుకున్న తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వీధి కుక్కల ప్రమాదాల నుండి ప్రజలను కాపాడాలని వాటి నివారణ చేపట్టాలని వీధి కుక్కలను జనావాసాలకు దూరంగా తరలించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈయనతో పాటు బాలుడు కుటుంబాన్ని పరామర్శించేవారు మన్సురాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ దర్పలపల్లి రాజశేఖర్ రెడ్డి ఆసుపత్రిని సందర్శించి బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, సంబంధిత డాక్టర్లను కోరడం జరిగింది, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో ఎంతోమంది వీధి కుక్కల ప్రమాదాలు ద్వారా ప్రాణాలు కోల్పోతున్నారని నివారణ చేపట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తనయుడిపై నమోదైన పోక్సో కేసును నీరుగార్చే కుట్ర చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనయుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసును



నీరుగార్చేందుకు కేంద్ర మంత్రి హోదాలో సంజయ్ కుట్ర పన్నుతున్నట్లు అనుమానాలు రేకెత్తుతున్నాయని, తక్షణమే బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేసి బిజెపి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై పోక్సో కేసు నమోదైతే ఇప్పటివరకు ఆయనను అరెస్ట్ చేయకపోవడం దారుణమని, కేసు నమోదు ఆయన తర్వాత అమ్మాయి వివరాలను,ఫోటోలను బండి భగీరథ్ ఎలా బహిర్గతం చేస్తాడని,అందుకు ఆయన తండ్రి సంజయ్ ఎలా సహకరిస్తాడని శ్రీనివాస్ ప్రశ్నించారు తండ్రీ ,తనయులపై రాష్ట్రంలో ప్రజలు మహిళలు ఆందోళనలు చేస్తున్నారని, కళ్ళుండి చూడలేని కబోధిలాగ బిజెపి వ్యవహరిస్తుందని,ఈ సంఘటనపై,బండి సంజయ్ పై బిజెపి ఎలాంటి చర్యలకు పూనుకోకపోగా అది పార్టీకి సంబంధించిన అంశం కాదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. బిజెపికి సంబంధం లేదంటూనే బిజెపి పార్టీకి చెందిన వారు అమ్మాయి ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ ఆమెను కించపరిచే విధంగా,ఆమె క్యారెక్టర్ ను అవహేళన చేసేవిధమైన పోస్ట్ లు సోషల్ మీడియాలో పెడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఉదాహరణకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభక్క దళం అనే గ్రూప్ లో పోస్ట్ పెట్టారని,కనీసం అమ్మాయి అని చూడకుండా మహిళా మాజీ ఎమ్మెల్యే పేరుతో ఉన్న అకౌంట్ లో ఇలా పోస్ట్ లు పెట్టడం దుర్మార్గపు చర్య అని,ఇలాగే వందలాది మంది బిజెపి నాయకుల పేర్లతో ఉన్న గ్రూపుల్లో కూడా వారి ఫాలోవర్స్ పోస్టులు పెడుతున్నారని, సోషల్ మీడియాలో ఎవరెవరైతే దుష్ప్రచారం చేస్తున్నారో వారి ఫేస్ బుక్, ఇన్స్టా గ్రామ్,ట్విట్టర్ అకౌంట్లను పరిశీలించి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.




# బండి సంజయ్ తనయుడు సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌నీ తొలగించాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్..

**భద్రాచలం (అక్షిత ప్రతినిధి):** సాయి భగీరథ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవినుండి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రటరీ కొప్పుల రవీందర్ డిమాండ్ చేశారు. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేసును నీరు గారిచేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులపై విచారణ జరపాలని రవీందర్ అన్నారు. పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని కోరారు. బండి సాయి భగీరథ తన తండ్రి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నాడని అండతో విద్యాసంస్థలలో ర్యాగింగ్ భౌతిక దాడులు మద్యం మత్తులో విద్యార్థులపై అరాచకాలుకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా తమను "హాని ట్రాప్" చేసేదని ప్రచారం చేస్తు కేసును తప్పుదోవ పట్టించే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమేనని రవీంద్ర అన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరిస్తున్నాడని సమాచారం కూడా వెలుగులోకి వస్తుందన్నారు. బాలికకు ప్రాణహాని పొంచి ఉందని తక్షణమే సాయి భగీరథున అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ గా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కిషోర్ సాయికుమార్ హేమంత్ కిరణ్ కుమార్ నరసింహ వివేక్వర్ధన్ సూర్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెయిలైన విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు ప్రారంభం

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, అక్షిత బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వ "99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఎస్ఎస్సి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసి వారి విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. మంగళవారం జి హెచ్ ఎస్ నరేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎస్సి లో ఫెయిల్ అవడం జీవితంలో ఓటమి కాదని, విద్యార్థులు నిరుత్సాహపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకుని చదువులో ఉన్న లోపాలను సరిదిద్దుకోవాలని కోరారు. విద్యార్థుల కోసం కౌన్సెలింగ్, ప్రత్యేక బోధన, రిమీడియల్ క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధించవచ్చని ప్రోత్స హించారు. జిల్లాలో జి హెచ్ ఎస్ నరేంద్రనగర్, జెడ్పీహెచ్ఎస్ (బాలి




కలు) నర్సంపేట పాఠశాలల్లో ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించ బడుతున్నాయనీ. మంగళవారం 66 మంది విద్యార్థులు హాజరయ్యారనీ గీసుగొండ, రాయపర్తి, వర్ధన్నపేట, సంగెం, వరంగల్ మరియు ఖిలా వరంగల్ మండలాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఈఓ రంగయ్య నాయుడు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. సబ్జెక్టు వారీగా ప్రత్యేక బోధన, మోడల్ పరీక్షలు, డౌట్ క్లారిఫికేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులు మే నెల 12 నుండి జూన్ 03 వరకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించబడనున్నాయన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఉండ్రాతి సుజన్ తేజ, డిడబ్ల్యూఓ రాజమణి, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, ఎంఈఓ, జీహెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రికి చట్టం చుట్టమా..?

### బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలి.

### గుంజపడుగు హరిప్రసాద్

### తెలంగాణ రక్షణ సేన




**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీసులు నిందితుడిని కాపాడేందుకు చెసే ప్రయత్నాలను తెలంగాణ రక్షణ సేన ఖండిస్తుందని మైనర్ బాలికను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ బాలికను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురిచేయడం అత్యంత దుర్మార్గపు చర్య అని, దీనిని తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

?సామాన్యుడికి ఒక చట్టం, కేంద్ర మంత్రి కుమారుడికి మరో చట్టం ఉంటుందా. పోక్సో కేసు నమోదైనా వెంటనే నిందితుడిని అరెస్టు చేయాలి కాని ఇప్పటి వరకు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను పోలీసులు అరెస్టు చెయ్యక పోవడం అంటే ఇది పూర్తిగా తెలంగాణ పోలిస్ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం అని వారు అన్నారు.

బాధిత తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కూడ కేసు నమోదు చేసి కేంద్ర మంత్రివర్గం నుండి వారిని తొలగించాలని టిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. కేంద్ర మంత్రిగా రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన వ్యక్తిగా బాధితురాలికి అండగా ఉండాల్సింది పోయి బాధితురాలికే న్యాయం జరుగకుండా తన స్వంత కొడుకును దొరకకుండా పారిపోయే విధంగా సహకరిస్తున్న బండి సంజయ్ కి కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదు. బాధితురాలు పోలిసుకు పిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచిన కూడ నిందితుడిని ఇప్పటి వరకు అరెస్టు చెయ్యక పోవడం చూస్తే ఈ రాష్ట్రంలో చట్టం ఎవ్వరికి చుట్టం అయ్యిందో తెలిసిపోతుంది.

కేంద్ర మంత్రి బండి సంజయ్ సాక్షాత్తు దేశ ప్రధాని పాల్గొన్న సభలో పాల్గొని అయన చేసిన ప్రసంగం నిందితుడే బాధితుడు అనే విధంగా మాట్లాడిన విధానం చూసిన తరువాత బండి సంజయ్ నే స్వయంగా నిందితుడిని పారిపోవడానికి సహకరించారు అనే అనుమానం కలుగుతోందని వారు అన్నారు.

పేట్ బషీరాబాద్ పోలిసులు పోక్సో కేసులో ఉండే కఠినమైన సెక్షన్లు పెట్టకుండా నామామాత్రపు సెక్షన్ పెట్టడం చూస్తే నిందితుడిని కాపాడేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ఎందుకంటే జాతీయ కాంగ్రెస్ స్పందించిన నలబై ఎనిమిది గంటల తరువాత రాష్ట్ర ప్రభుత్వం కానీ స్థానిక కాంగ్రెస్ పెద్దలు మాట్లాడటం చూస్తేనే మనకు చాలా స్పష్టంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండు వేరు కాదని అర్థం అవుతుంది.

బాలిక కుటుంబం పిర్యాదు ఇవ్వడానికి పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ కు పోతే ఎనిమిది గంటలపాటు వాళ్ళ దరఖాస్తును తీసుకోకుండా ఇబ్బందులు పెడితే అప్పుడు ఆ కుటుంబ సభ్యులు రేపు పెరేడ్ గ్రౌండ్ లో సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోదీ ముందే మేము ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తే తప్ప పోలిసులు కేసు తీసుకోలేదని వారు అన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న కానీ ఈ సంఘటనతో చాలా స్పష్టంగా తెలిసిపోతుంది బీజేపీ మరియు సీఎం రేవంత్ రెడ్డి మధ్య ఉన్న మైత్రి బంధం ఎంటో తేలిపోయింది. దాని ప్రతిఫలంగానే బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ ను పోలిసులు అరెస్ట్ చెయ్యడం లేదనే విషయం ప్రజలంనందరికి తెలిసిపోతుంది.

పేద ప్రజలకు ఒకవిధమైన న్యాయం. డబ్బు అధికారం ఉన్న వారికి మరొక్క విధమైన న్యాయం అనేది ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే చూస్తున్నాం. సామాన్యులకు న్యాయ వ్యవస్థ మీద చట్టాల మీద నమ్మకం కలుగాలంటే తక్షణమే పోలిస్ ఉన్నతాధికారులు పారిపోయిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుందని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.





# దేవాలయాలు సమాజ ఐక్యతకు ప్రతీకలు

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### మహబూబ్‌నగర్‌లో ఆంజనేయ స్వామి, గరుత్మంతుడి విగ్రహాల ఆవిష్కరణ

**మహబూబ్ నగర్, అక్షిత్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ నగరంలోని సింహగిరి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆంజనేయ స్వామి మరియు గరుత్మంతుడి సుధామూర్తుల విగ్రహాలను ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ఘుజమాలలు వేసి భక్తి శ్రద్ధలతో అలంకరించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు వేద ఆశీర్వాదాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయ అభివృద్ధి కోసం ముడా నిధుల కింద రూ.10 లక్షల వ్యయంతో గ్రీనరీ అభివృద్ధి, డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాక సమాజ ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాల కోసం అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు దేవాలయ ప్రాంగణంలో చేపడతామని తెలిపారు.

శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయ క్షేత్రపాలకులైన గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన జరుపుకోవడంతో ఇప్పుడు ఆలయం సంపూర్ణ రూపాన్ని సంతరించుకుందని, ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని క్షేత్ర పాలకుల విగ్రహాలు ఆవిష్కరించే భాగ్యం తనకు కలగడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ ఆలయం దేదీప్యమానంగా వెలుగుతూ భక్తుల కోరికలు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారు నెరవేర్చాలని ఆయన ఆకాంక్షించారు . దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, దేవాలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షులు పోల శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ కృష్ణయ్య, తిరుపతి నాయక్ మరియు ఆలయ కమిటీ సభ్యులు నాయకులు చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
బుధవారం 13, మే 2026




# ఉద్దండపూర్ భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**జడ్చర్ల మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

మహబూబ్ నగర్ అక్షిత ప్రతినిధి:

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉదండాపూర్ భూనిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ మరియు జడ్చర్ల మిషన్ భగీరథ నీటి సరఫరా అంశాలపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో కలిసి భూనిర్వాసితులకు అందాల్సిన పునరావాసం, పరిహారం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజ్‌ను అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూనిర్వాసితుల సమస్యలను సానుభూతితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

అనంతరం జడ్చర్ల నియోజకవర్గంలోని మిషన్ భగీరథ నీటి సరఫరా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, తండాలు, కాలనీలకు తాగునీటి సరఫరా నిరంతరాయంగా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా పైప్‌లైన్ సమస్యలు, మోటార్ లోపాలు లేదా నీటి సరఫరాలో అంతరాయం ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి తెలిపారు.

# కేంద్రమంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి

**ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ, సీపీఐ**

వనపర్తి అక్షిత ప్రతినిధి:

కరీంనగర్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ మైనర్ బాలికపై లైంగిక దాడికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షులు, కేతేపల్లి ఉప సర్పంచ్ కృష్ణవేణి, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు మాజీ సర్పంచ్ కళావతమ్మ, సిపిఐ జిల్లా




కార్యదర్శి కే శ్రీరామ్, సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పానగల్ మండలం కేతేపల్లి బస్టాండ్ లో బండి సాయి భగీరథ్ మైనర్ బాలికపై లైంగిక దాడికి ఎన్ఎఫ్ఐ డబ్ల్యు, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను పూజించే గౌరవించే దేశం మనదని, సనాతన ధర్మాన్ని కాపాడుతామని బిజెపి నేతలు గొప్పలు చెబుతారని, ఆచరణలో నీచంగా వ్యవహరిస్తారని విమర్శించారు. కరీంనగర్లో మైనర్ బాలికపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడి దురాగతం దీనికి తాజా ఉదాహరణ అన్నారు. బిజెపి పాలిత మణిపూర్ రాష్ట్రంలో గతంలో ఇద్దరుమహిళలను నగ్నంగా ఊరేగించారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యంలో ఎదిగిన బండి సంజయ్ తన కుమారుడికి సత్ప్రవర్తన నేర్పించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. తండ్రిగా కుమారునికి సత్ప్రవర్తన నేర్పించడంలో వైఫల్యానికి ఆయన నైతిక బాధ్యత వహించాన్నారు. లైంగిక దాడిపై బాలిక కుటుంబ సభ్యులు సాయి భగీరథ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసినా ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. సామాన్యుల పిల్లలు లైంగిక దాడి నేరానికి పాల్పడితే ఫోక్సో కేసు పెట్టి, వెంటనే నిందితులను అరెస్టు చేస్తారని దొరకకపోతే తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్లో కూర్చోబెడతారని మరి బండి సంజయ్ కుమారుని అరెస్ట్ చేయకుండా పోలీసులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. సామాన్యుడికి ఒక నీతి ఉన్నత పదవుల్లో ఉన్న వారికి మరొక నీతా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సాయి భగీరథ అరెస్టుపై ఆలస్యాన్ని ఖండించారు. బాధ్యత గల కేంద్ర మంత్రిగా తన కొడుకును పోలీసులకు సరెండర్ చేయాలని లేదా నైతిక బాధ్యత వహించి కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు.

రాజీనామా చేయకుంటే ప్రధాని జోక్యం చేసుకొని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సాయి భగీరథ కూడా తనపై హనీ ట్రాప్ జరిగిందని పోలీస్ స్టేషన్లో బాలిక కుటుంబంపై ఫిర్యాదు చేశారని ఇంతకంటే దారుణం మరొకటి ఉండదన్నారు. ఇది కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం అని, సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేదంటే సిపిఐ, అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరామ్ సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మాజీ వార్డు సభ్యుడు కమ్మావుల పెంటయ్య ,వార్డు మెంబర్ మాల కురువమ్మ, సిపిఐ కేతపల్లి గ్రామ శాఖ కార్యదర్శికాకం చిన్న నారాయణ, కాకం కాశన్న, రామాంజనేయులు, బాలస్వామి, ఎల్లయ్య, ఎల్లమ్మ, రామదాసు, కాకం కాశన్న, నీలమ్మ ,బొక్కలమ్మ, సాయి లీల ,బోయ చిన్న కుర్మయ్య ,బీరయ్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి

**రైతులకు ఇబ్బందులు రాకుండా యుద్ధప్రాతిపదికన వరి కొనుగోలు ప్రక్రియ**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి అక్షిత ప్రతినిధి:

రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన వడ్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి తరలించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం మొక్క జొన్న, వరి కొనుగోలు పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు, ప్రధాన కార్యదర్శితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్




నిర్వహించి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, గోదాములు, ట్రాన్స్పోర్ట్, హమాలీల సమస్యలు జిల్లాస్థాయిలోనే కలెక్టర్లు పర్యవేక్షించి పరిష్కరించుకోవాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసే బాధ్యత కలక్టర్లదే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనంతరం జిల్లా అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు 10 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి మిల్లులకు, గోదాములకు తరలించాలని ఆదేశించారు. సెక్టార్ వారిగా ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు ఒప్పందం చేసుకున్న దానిప్రకారం స్వంత వాహనాలతో సహా వారు చెప్పిన అద్దె వాహనాలు అన్ని ధాన్యం తరలించేందుకు కేటాయించాల్సిందే అని తెలిపారు. ఒకవేళ ఒప్పందం ప్రకారం లారీలు పెట్టుకుంటే వెంటనే చీటింగ్ కేసు బుక్ చేయాలని, గత సీజన్ తో పాటు ఈ సీజన్ డబ్బులు సైతం ఇవ్వకుండా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు పనిచేస్తూ రవాణా వాహనాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న లారీ అసోసియేషన్ లతో మాట్లాడి జిల్లాకు సంబంధించిన అన్ని లారీలు, డి.సి.యం.లు ధాన్యం తరలించేందుకు వినియోగించుకోవాలని ట్రాన్స్పోర్ట్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గోదాములు ధాన్యం నిల్వలకు తీసుకోవాలని, గోదాములను గుర్తించి జాబితా ఇవ్వాలని సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. గోదాములతో పాటు సీజ్ చేసిన రైస్ మిల్లులను ధాన్యం నిల్వ చేసేందుకు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులో లేదా గోదాములో డౌన్లోడ్ చేసుకోవాలని అవసరమైతే పోలీస్ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. అగ్రిమెంట్ చేసుకున్న అన్ని 53 మిల్లులకు ప్రతి రోజు వడ్లు పంపించి వెంటనే డౌన్లోడ్ జరిగేవిధంగా చూడాలన్నారు. అన్ని మిల్లుల వద్ద ప్రభుత్వ సిబ్బందిని పెట్టి రోజువారీ వడ్లు డౌన్లోడ్ ప్రక్రియను పర్యవేక్షించి నివేదిక ఇచ్చేవిధంగా చూడాలని చెప్పారు. హమాలీల సమస్య లేకుండా చూడాలని లేబర్ కమిషనర్ ను ఆదేశించారు. కొనుగోలు కేంద్రం పెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు వచ్చిన మొత్తం ధాన్యం ఎంత ఈ రోజు కొనుగోలు చేసి తరలించిన ధాన్యం ఎంత అనే వివరాలు ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈరోజు నుండి ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యే వరకు రోజువారీ డేటాను మీడియాకు ఇవ్వాల్సిందిగా సూచించారు. రానున్న 15 రోజులు అదనపు కలెక్టర్ రెవెన్యూ తో సహా సివిల్ సప్లై, మార్కెటింగ్, వ్యవసాయ, డి.ఆర్.డి.ఓ, డి.సి.ఓ, ట్రాన్స్పోర్ట్ తదితర శాఖలు అన్ని వడ్లు కొనుగోలు పైనే దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ రెవిన్యూ వినోద్ కుమార్, పి డి ఆర్ డి ఓ ఉమాదేవి, జిల్లా సివిల్స్ పై అధికారి కాశీ విశ్వనాథ్, డి.ఎం. ఆంజనేయులు జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు కోపరేటివ్ అధికారి బి రాణి ట్రాన్స్పోర్ట్ అధికారి మానస మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.